7
సాక్షి సంగారెడ్డి
ఆదివారం । 24 । ఆగస్టు । 2025

సండే స్పెషల్

వసుధైక కుటుంబం



సృష్టిలో మనిషికి మనిషే తోడు. సేవాభావంలోను సాయపడటంలోనే మానవత్వం పరిమళిస్తుంటుంది. సేవ, సాయమే పరమావధిగా పనిచేసే మనుషులందరూ ఒకే చోట ఉంటూ పొరుగువారి సమస్యను తమదిగా భావించి పరిష్కరిస్తున్నారు తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని గేటెడ్ కమ్యూనిటీ వాసులు. వట్టి మాటలు కట్టిపెట్టి గట్టి మేల్ తలపెట్టవోయ్ అన్న గురజాడ పలుకుల్ని ఆదర్శంగా తీసుకున్నారేమో వీరంతా. ఎక్కడెక్కడి వారో ఇక్కడకు చేరి సేవలోనూ, సాయమందించడంలోనూ తమ ఉదారతను దాతృత్వాన్ని చాటుకుంటూ ఏకత్వంలో భిన్నత్వాన్ని, భిన్నత్వంలో ఏకత్వాన్ని ప్రదర్శిస్తున్న ఈ 'గ్రేటెడ్'కమ్యూనిటీ వాసులపై 'సాక్షి'సండే స్పెషల్.

వివరాలు 8లో

న్యూస్‌రీల్

ప్రణాళికాబద్ధంగా ధాన్యం కొనుగోళ్లు

అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి జోన్: 2025–26 ఆర్థిక సంవత్సరంలో ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లు ప్రణాళికా బద్ధంగా చేపట్టాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లపై కలెక్టరేట్‌లో శనివారం వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ..రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. గ్రామాలకు దగ్గరగా కొనుగోలు కేంద్రాలు ఉండే విధంగా చూడాలని సూచించారు. రైతులు ధాన్యాన్ని సులభంగా అమ్ముకునే విధంగా తగిన వసతులు కల్పించాలని ఆదేశించారు. పంట సాగు పరిస్థితులు, దిగుబడులపై అంచనా వేసి నివేదికలు సిద్ధం చేయాలన్నారు. ప్రతీ రైస్ మిల్లును తప్పనిసరిగా తనిఖీ చేయాలన్నారు. సమీక్షలో పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ అంబాదాస్ రాజేశ్వర్, పౌరసరఫరాల శాఖ అధికారి బాలసరోజ, డీఆర్‌డీఓ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

యూఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు రవి



కరపత్రాన్ని విడుదల చేస్తున్న యూఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: సెప్టెంబర్ 26,27,28వ తేదీల్లో నిజామాబాద్‌లో నిర్వహించే యూఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ప్రథమ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రవి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో శనివారం మహాసభలకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ..విద్యారంగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను చర్చించి, భవిష్యత్ కార్యాచరణ రూపకల్పన చేయనున్నామన్నారు. మూడోసారి అధికారంలోకి బీజేపీ ప్రభుత్వం నూతన విద్యావిధానాన్ని తీసుకువస్తూ విద్యార్థుల్లో మేధావుల్లో గందరగోళాన్ని సృష్టిస్తుందని మండిపడ్డారు. విద్యారంగం పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు, రవి తేజ, శేఖర్, సాత్విక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధిక నేరాలు ఉంటే గ్యాంగ్ కేసులు

జిల్లా ఎస్పీ పరితోశ్ పంకజ్

సంగారెడ్డి జోన్: నూతన చట్టం ప్రకారం గత పదేళ్లలో ఇద్దరు, అంతకన్నా ఎక్కువ మంది వ్యక్తులు కనీసం రెండు నేరాలు చేసి ఉంటే వారిపై గ్యాంగ్ కేసులను నమోదు చేయనున్నట్లు జిల్లా ఎస్పీ పరితోశ్ పంకజ్ శనివారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. ఎక్కువ మంది వ్యక్తులు కలిసి గ్యాంగ్‌గా ఏర్పడి వివిధ రకాల ఆస్తి సంబంధిత నేరాలకు పాల్పడుతున్నారని తెలిపారు. భవిష్యత్తులో తిరిగి ఇలాంటి నేరాలు చేయకుండా నివారించడమే ఈ గ్యాంగ్ కేసుల ముఖ్యఉద్దేశమన్నారు. గ్యాంగ్ కేసులకు నాన్ బెయిలబుల్‌తోపాటు ఏడేళ్ల వరకు కఠిన కారాగార శిక్ష, జరిమానా కూడా విధించే అవకాశముందని తెలిపారు.

మున్సిపల్ కార్మికులను విస్మరిస్తున్న ప్రభుత్వం

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్



సమావేశంలో మాట్లాడుతున్న భాస్కర్

పటాన్‌చెరు టౌన్: మున్సిపల్ కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం చిన్న చూపు చూస్తూ వారిని పూర్తిగా విస్మరిస్తోందని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్ ఆరోపించారు. పటాన్‌చెరు పట్టణంలోని అంబేడ్కర్‌భవన్‌లో శనివారం జరిగిన మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఐదవ జిల్లా మహాసభలలో ఆయన పాల్గొని మాట్లాడారు. మున్సిపల్ కార్మికులకు పని గంటలు తగ్గించకపోవడం వల్ల పని భారం పడుతుందన్నారు. ఒకవైపు పని భారం పడుతున్నా వేతనాలను పెంచడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు ఈఎస్‌ఐ, పీఎఫ్ ఇతర చట్టపరమైన సౌకర్యాలు కల్పించాలని లేని పక్షంలో పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రమాదేవి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు, కోశాధికారి కె.రాజయ్య, మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లకు ఇక స్వస్తి

కేంద్ర బృందం హెచ్చరికలతో మారిన 'ఉపాధి'పనుల ఎంపిక తీరు

- వీటి నిర్మాణంలో భారీ అక్రమాలే కారణమా?
- రైతులకు వ్యక్తిగత లబ్ధి చేకూర్చే పనులకే ప్రాధాన్యం?



ఉపాధి హామీ పనులను ఆసరాగా తీసుకుని కొందరు అక్రమాలకు పాల్పడుతుండటాన్ని పరిశీలించిన కేంద్ర బృందం ఆ పథకంలో పనుల ఎంపిక తీరును పూర్తిగా మార్చింది. సీసీ రోడ్ల నిర్మాణానికి ఉపాధి నిధులు పైసా కూడా విదిల్చేది లేదని హెచ్చరించడంతో ఈసారి ఉపాధి పనుల తీరు మారనున్నాయి.

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ఉపాధి హామీ పథకం నిధులను ఏటా సీసీ రోడ్ల నిర్మాణానికి కేటాయించడం పరిపాటైపోయింది. ఈ సీసీ రోడ్ల నిర్మాణంలో అంతేస్థాయిలో అక్రమాలు సాధారణమైపోయాయి. మెటీరియల్ కాంపోనెంట్ కింద అందుబాటులో ఉన్న ఉపాధి హామీ నిధుల్లో సుమారు 80% ఈ సీసీ రోడ్లకే వెచ్చించే వారు. రాజకీయ పలుకుబడి ఉన్న స్థానిక గ్రామ పంచాయతీల తీర్మానాల పేరుతో మొక్కుబడి పనులు చేయడం, రూ.లక్షల్లో నిధులు నొక్కేయడం వంటివి పరిపాటిగా మారింది. కనీసం రెండు, మూడు దశాబ్దాలపాటు ఉండాల్సిన ఈ సీసీ రోడ్లు నాసిరకంగా రోడ్ల నిర్మించడంతో రెండు, మూడేళ్లకే పగుళ్లు రావడం, కంకర తేలి కనిపిస్తుండటాన్ని కేంద్ర బృందం పసిగట్టింది. దీంతో కేంద్ర బృందం ఈసారి సీసీ రోడ్లకు కేటాయింపులు తగ్గించాలని ఆదేశించింది. రెండు నెలల క్రితం జిల్లాలో రాయికోడ్, మొగుడంపల్లి మండలాలతోపాటు సిద్దిపేట, మెదక్ జిల్లాలోనూ కేంద్ర ఉన్నతాధికారుల బృందం పర్యటించి ఉపాధి పనుల తీరును పరిశీలించింది. రానున్న రోజుల్లో ఉపాధి పథకం నిధులతో సీసీ రోడ్లకు తగ్గించాలని సూచించింది. లేనిపక్షంలో బిల్లులు నిలిపివేస్తామని హెచ్చరించినట్లు సమాచారం.

వ్యక్తిగత వ్యవసాయ అనుబంధ పనులివే

గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేద వ్యవసాయ కూలీల వలసలను నివారించి..స్థానికంగా పనులు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఉపాధి పథకాన్ని అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ పథకం కింద వచ్చే మెటీరియల్ కాంపోనెంట్ నిధులను పశువుల పాకలు, గొర్రెల షెడ్లు, ఫౌల్ట్రీఫాంలు, నాడెపు కంపోస్టు షెడ్లు, అజోల, చెక్‌డ్యాంలు, నీటి కుంటలు వంటి పనులకు వెచ్చిస్తున్నారు. గతేడాది సుమారు 80% ఉపాధి హామీ మెటీరియల్ కాంపోనెంట్ నిధులను సీసీ రోడ్లకు కేటాయించగా, ఈసారి పూర్తిగా తగ్గించామని గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి 'సాక్షి'తో తెలిపారు.

పనుల జాతర తీరిలా..

- సంగారెడ్డి జిల్లాలో ఈసారి రూ.19.59 కోట్ల వ్యయంతో 2,451 పనులను ప్రారంభించారు. ఇందులో 62 అంగన్‌వాడీ, 27 గ్రామ పంచాయతీ భవనాలు ఉండగా మిగిలిన పశువుల పాకలు, గొర్రెల షెడ్లు వంటి వ్యక్తిగత పనులున్నాయి.
- మెదక్ జిల్లాలో రూ.20.66 కోట్లతో 3,238 పనులను చేపట్టారు. ఇందులో 37 అంగన్‌వాడీ, 33 గ్రామపంచాయతీ భవనాలున్నాయి. మిగిలిన వ్యక్తిగత ప్రయోజనం చేకూర్చే పనులను ఎంపిక చేశారు.
- సిద్దిపేట జిల్లాలో 496 గ్రామపంచాయతీల్లో రూ.12.85 కోట్లతో 536 పనులను చేపట్టారు. ఇందులో అంగన్‌వాడీ, గ్రామపంచాయతీ భవనాలు సుమారు 20 వరకు ఉంటాయి.

పనుల జాతరలో అంగన్‌వాడీ, జీపీ భవనాలు

రాష్ట్ర ప్రభుత్వం పనుల జాతర పేరుతో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టిన విషయం విదితమే. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, పీఆర్ ఇంజనీరింగ్, గ్రామీణ నీటిసరఫరా, స్వచ్ఛభారత్‌మిషన్ తదితర విభాగాల సమన్వయంతో వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించింది. ఇందులో అంగన్‌వాడీ, గ్రామపంచాయతీ భవనాలు, పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణం వంటిపనులను చేపట్టింది.

మరో నాలుగేళ్లు బీమా ధీమా

- మహిళా సంఘాల బీమా పథకం పొడిగింపు
- జిల్లావ్యాప్తంగా 106 మందికి బీమా పథకం



సమావేశం నిర్వహించిన మహిళా సంఘం సభ్యులు

సంగారెడ్డి టౌన్: మహిళలు ఆర్థికంగా స్థిరపడేందుకు రాష్ట్ర ప్రభుత్వం వివిధ రకాల రుణాలను అందజేస్తుంది. గ్రామంలోని మహిళలు వివిధ వ్యాపారాలు చేసుకుంటూ ఆర్థిక స్వావలంబన సాధించేందుకు స్త్రీ నిధి, బ్యాంకు లింకేజీ ద్వారా వివిధ రూపాలలో మహిళా సంఘాలకు ప్రభుత్వం రుణాలనిస్తోంది. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా కోటిమందిని కోటీశ్వరులుగా మార్చేందుకు కృషి చేస్తోంది. మహిళా సంఘాల సభ్యులకు ఇంత జేస్తున్న ప్రభుత్వం గతేడాది నుంచి బీమా పథకాన్ని కూడా అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. మహిళా సంఘాల్లోని సభ్యులు ఎవరైనా ప్రమాదవశాత్తూ మృతి చెందితే ఉచిత బీమా సదుపాయం కింద రూ.10 లక్షల చొప్పున ఆర్థికసాయం అందజేస్తోంది. అయితే ఈ ఉచిత బీమా పథకాన్ని ప్రభుత్వం తాజాగా మరో నాలుగేళ్ల వరకు పొడిగించింది. దీంతోపాటు రుణబీమా పథకాన్ని అమలు చేస్తున్నారు. ఈ పథకమూ ఉచితమే. లోన్ బీమా పథకంలో స్త్రీనిధి నుంచి రుణాలు పొందిన వారు ఏ కారణం చేతనైనా చనిపోతే వారు తీసుకున్న దాంట్లో గరిష్ఠంగా రూ.2 లక్షలు మాఫీ చేసేవారు.

ఇదివరకు బీమా సంస్థ.. ఇప్పుడు ప్రభుత్వమే

మహిళా సంఘాల్లో సభ్యులెవరైనా ప్రమాదవశాత్తూ చనిపోతే బీమా కంపెనీ రూ.10 లక్షల పరిహారం చెల్లించేది. ఇప్పుడు బీమా కంపెనీ నుంచి కాకుండా ప్రభుత్వమే రూ.10 లక్షల ఆర్థిక సాయం చేస్తుంది. ఇది మహిళలకు ఎంతో ఉపయోగపడనుంది. జిల్లావ్యాప్తంగా 695 గ్రామ, 25 మండలాల్లో ఉన్న సంఘాల్లో 1.96 లక్షలమంది సభ్యులున్నారు. జిల్లాలో 106 మందికి రుణ బీమా ద్వారా రూ.99.45 లక్షలను అందజేశారు. ప్రమాద బీమా ద్వారా ఐదుగురికి రూ.50 లక్షలు అందజేశారు.

సభ్యత్వం ఉంటే ప్రమాద బీమా

ప్రమాద బీమా పథకానికి సభ్యులు ఎలాంటి ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదు. సంఘంలో సభ్యురాలైతే చాలు ఈ పథకం వర్తిస్తుంది. పరిహారం కింద వచ్చిన మొత్తాన్ని సభ్యురాలి నామినీ బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు.

అవగాహన కల్పిస్తున్నాం



మహిళా సంఘంలోని సభ్యులకు బీమా పథకంపై అవగాహన కల్పిస్తున్నాము. సంఘంలోని సభ్యులకు బీమా వెంటనే అమలు అయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. మహిళలు ఆర్థికంగా స్థిరపడేందుకు స్త్రీ నిధి ద్వారా రుణాలను అందజేస్తున్నాం.

–శ్రీనాథ్, స్త్రీనిధి బ్యాంక్ రీజినల్ మేనేజర్

మంత్రులకు బ్రహ్మోత్సవాల ఆహ్వానం



మంత్రి కొండా సురేఖకు ఆహ్వాన పత్రాన్ని అందిస్తున్న ఆలయ ఈవో, సభ్యులు

పటాన్‌చెరు: వినాయక చవితి పురస్కరించుకుని ఈ నెల 27 నుంచి సెప్టెంబర్ 6 వరకు పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామ పరిధిలోని గణేశ్‌గడ్డ దేవస్థానంలో జరగనున్న బ్రహ్మోత్సవాలకు రావాలని మంత్రి కొండా సురేఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్, మెదక్ ఎంపీ రఘునందన్‌రావుకు ఆలయ నిర్వాహకులు ఆహ్వానించారు. ఈ మేరకు హైదరాబాద్‌లో కొండా సురేఖ, వివేక్, రఘునందన్‌రావుకు వారి వారి నివాసంలో దేవస్థానం ఈఓ లావణ్య, ఆలయ ధర్మకర్తలు, అర్చకులతో శనివారం ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ లావణ్య మాట్లాడుతూ...ప్రతీ సంవత్సరం వినాయక చవితిని పురస్కరించుకుని ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులందరూ పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఆహ్వాన పత్రికను అందజేసిన వారిలో మాజీ సర్పంచులు సుధీర్ రెడ్డి, వెంకన్న, అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యతో స్థిరపడాలి



విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఉన్నతాధికారులు పరితోశ్, ఉమాహారతి

ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: ప్రతీ ఒక్కరూ ఉన్నత చదువులు చదివి జీవితంలో మంచిగా స్థిరపడాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఆకాంక్షించారు. ఖేడ్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల విద్యార్థులు 875మందికి డిగ్నిటీ డ్రైవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగ్స్, కెరీర్ గైడెన్స్ పంపిణీ చేసి ప్రయాణ భద్రత, నారీ శక్తి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఖేడ్ మోడల్ డిగ్రీ కళాశాల ఫస్టియర్ విద్యార్థుల ప్రెషర్స్ డే కార్యక్రమంలో పాల్గొని వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ఆడపిల్లలను తల్లిదండ్రులు డిగ్రీ వరకు తప్పకుండా చదివించాలన్నారు. ఆడపిల్లలకు 21ఏళ్లలోపు ఎట్టి పరిస్థితుల్లోనూ వివాహం చేయకూడదన్నారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. జిల్లా ఎస్పీ పరితోశ్, పంకజ్, ఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతి మాట్లాడుతూ.. జీవితంలో లక్ష్యాలను సాధించేందుకు కష్టించి చదువుకోవాలని కోరారు. రోడ్డు భద్రతను పాటించాలని, నిబంధనలపై అందరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. చదువులో ఎదురయ్యే ఇబ్బందులు, సందేహాలను అధ్యాపకులను అడిగి నివృతి చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.నారాయణ, వైస్ ప్రిన్సిపాల్ పోశెట్టి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఉమామహేశ్వర్ రావు, నాయకులు దారం శంకర్, రమేష్ చౌహాన్, యాదవరెడ్డి, డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్ రెడ్డి, ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డి, ఎంఈవో మన్మథకిషోర్ తదితరులు పాల్గొన్నారు. కాగా, డిగ్నిటీ డ్రైవ్ ఫౌండేషన్ చైర్మన్ రేణిగ్రేస్ మిత్రబృందం పాఠశాలకు రూ.30వేలు విరాళంతోపాటుగా బాలికలకు ఆరోగ్య సామగ్రిని అందించారు.

డంప్‌యార్డు అభివృద్ధికి రూ.18 కోట్లు: జగ్గారెడ్డి

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: జిల్లా కేంద్రంలోని డంప్‌యార్డు అభివృద్ధికి హెచ్‌ఎండీఏ (హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ) రూ.18 కోట్లు మంజూరు చేసేందుకు ఆ సంస్థ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ అంగీకరించారు. ఈ మేరకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. పట్టణంలో చెత్తను సెగ్రిగేషన్ చేసేందుకు ప్రస్తుతం యంత్రాల సామర్థ్యం సరిపోవడం లేదని, వీటి స్థానంలో ఆధునిక సాంకేతికతతో కూడిన ఎక్కువ సామర్థ్యం కలిగిన యంత్రాలను ఏర్పాటు చేసేందుకు ఈ నిధులను వెచ్చించనున్నట్లు తెలిపారు.

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

సదాశివపేట(సంగారెడ్డి): అతిథి అధ్యాపకపోస్టుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బంగ్లా భారతి శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈనెల 25 సాయంత్రం 5గంటలకల్లా కళాశాలలో దరఖాస్తులు అందజేయాలని తెలిపారు. ఈనెల 26న తారా డిగ్రీ కళాశాల సంగారెడ్డిలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు. ఇతర వివరాలకు 9441743170, 8341298597 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

డ్రగ్స్‌పై పోరులో యువత భాగస్వామ్యం

జిల్లా ఆరోగ్య అధికారి శ్రీనివాస్



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: మత్తు పదార్థాల నిర్మూలనలో యువత భాగస్వామ్యం కావాలని జిల్లా ఆరోగ్య అధికారి శ్రీనివాస్ తెలిపారు. తారా ప్రభుత్వ కళాశాల నిషా ముక్తి భారత్ అభియాన్, మిషన్ పరివర్తనలో భాగంగా సంగారెడ్డి జిల్లా మహిళా శిశు, వికలాంగుల, వయోజన వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన డ్రగ్స్ అక్రమ రవాణా వ్యతిరేక అవగాహన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. మత్తు పదార్థాలు వ్యక్తులను మానసికంగా, శారీరకంగా నిర్వీర్యం చేస్తాయన్నారు. మత్తు పదార్థాలు అమ్మినా, కొన్నా, వినియోగించిన నేరమని, ఎవరు డ్రగ్స్ బారిన పడవద్దని సూచించారు. విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడవద్దని, ర్యాగింగ్ చేసినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి మాట్లాడుతూ..విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలన్నారు. సీఐ రమేశ్ మాట్లాడుతూ..యువత సైబర్ మోసాలకు గురికావొద్దని, ఫోన్లకు వచ్చే అపరిచిత కాల్స్‌కు ప్రతి స్పందించవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌సీపీ అధికారి డాక్టర్ కెప్టెన్ విజయ, ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు, అధ్యాపక బృందం, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు, ఎన్‌సీపీ క్యాడెట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

దత్తగిరిలో దామోదర పూజలు



ఝరాసంగం(జహీరాబాద్): జిల్లాలో ఆధ్యాత్మిక క్షేత్రమైన బర్దిపూర్ శ్రీ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో శనివారం అమావాస్యను పురస్కరించుకుని శ్రీ శనీశ్వర జయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఏడాకులపల్లిలో ఈ వేడుకలు నిర్వహించారు. తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, మహారాష్ట్రల్లోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. కాగా, బర్దిపూర్‌లో మంత్రి దామోదర రాజనర్సింహ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆశ్రమ పీఠాధిపతులు తీర్థ ప్రసాదాలు అందించి, పూలమాల శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఆశ్రమ పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ 108 వైరాగ్య శిఖామణి అవధూత గిరి మహారాజ్, డాక్టర్ సిద్దేశ్వర స్వామి తదితరులు పాల్గొన్నారు.





కేతకీలో భక్తుల రద్దీ

ఝరాసంగం(జహీరాబాద్): కేతకీ సంగమేశ్వరాలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. శ్రావణ మాసం చివరి రోజు కావడంతోపాటు అమావాస్యను పురస్కరించుకుని తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు ఆలయ ఆవరణలోని అమృతగుండంలో పవిత్ర పుణ్యస్నానాలను ఆచరించి, జల లింగానికి పూజలు చేశారు. అనంతరం గర్భగుడిలోని పార్వతీ పరమేశ్వరులను సందర్శించుకున్నారు. ఆలయ అర్చకులు భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

గ్రేడ్ తెద్దామిలా

- సెలక్షన్ గ్రేడ్ కోసం అధికారుల ప్రయత్నం
- అవకాశాల సద్వినియోగానికి కార్యాచరణ
- వ్యవసాయ మార్కెట్‌కు ప్రతీ ఏటా పెరుగుతున్న ఆదాయం



జహీరాబాద్ వ్యవసాయ మార్కెట్ కార్యాలయం

జహీరాబాద్: జహీరాబాద్ వ్యవసాయ మార్కెట్ కార్యాలయానికి ఆదాయం పెంచి సెలక్షన్ గ్రేడ్ సాధన కోసం అధికారులు దృష్టి సారించారు. ఆదాయాన్ని రెట్టింపు చేయడం ద్వారా ఈ ఘనత సాధించవచ్చని భావిస్తున్నారు. ప్రస్తుతం సుమారు రూ.3.50 కోట్ల మేర ఆదాయం సమకూరుతోంది. దీన్ని రెట్టింపు చేసే దిశలో అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందుకోసం ప్రణాళికను రూపొందించేందుకు నిర్ణయించారు. గత నాలుగు దశాబ్దాల క్రితం జహీరాబాద్ వ్యవసాయ మార్కెట్ మూడు ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేశారు. అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతూ ఆదాయాన్ని పెంచుకుంటోంది. ఒకప్పుడు సాధారణ మార్కెట్‌గా ఉండగా, ప్రస్తుతం స్పెషల్ గ్రేడ్ స్థాయికి అనధికారికంగానే చేరింది. జహీరాబాద్ అంతర్రాష్ట్ర సరిహద్దుగా ఉంది. నియోజకవర్గం ప్రాంతం నుంచే కాకుండా కర్ణాటక ప్రాంతం నుంచి కూడా రైతులు ధాన్యం తెచ్చి విక్రయించుకుంటున్నారు. మార్కెట్‌కు గంజ్ ద్వారా ప్రతీ ఏటా రూ.83.50 లక్షలు, సరుకుల దిగుమతి ద్వారా రూ.2.92 కోట్లు, చెక్ పోస్ట్ ద్వారా రూ.5.45 లక్షలు, పశువుల మార్కెట్ ద్వారా రూ.31.85 లక్షలు, పండ్ల మార్కెట్ ద్వారా రూ.40వేలకు పైగా ఆదాయం సమకూరుతోంది. ప్రస్తుతం మార్కెట్ యార్డులో పాత గోదాం తొలగించి రూ.3.35 కోట్లతో 24 కొత్త దుకాణాల సముదాయాన్ని నిర్మించేందుకు ప్రతిపాదించారు. దీని ద్వారా కూడా మార్కెట్ ఆదాయాన్ని పెంచుకునేలా నిర్ణయించారు. ఇతర ఆదాయ మార్గాలను సైతం అన్వేషిస్తున్నారు.

గ్రేడ్ పెరిగితే అభివృద్ధికి ఆస్కారం

వ్యవసాయ మార్కెట్‌ను స్పెషల్ గ్రేడ్‌కు పెంచుకోవడం వల్ల పలు అభివృద్ధి పనులు చేసుకునేందుకు వీలవుతుంది. కార్యాలయంలో సిబ్బందిని మరింత పెంచుకోవచ్చు. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేసుకునేందుకు దోహదపడుతుంది. గంజ్ మైదానంలో రోడ్లను నిర్మించుకునే అవకాశం ఉంటుంది. పశువుల మార్కెట్లో కనీస సదుపాయాలను ఏర్పాటు చేసుకునే వీలుంటుంది.

మార్కెట్‌కు సమకూరుతున్న ఆదాయం

సంవత్సరం	ఆదాయం
2020–21	రూ.1.30కోట్లు
2021–22	రూ.2.19కోట్లు
2022–23	రూ.2కోట్లు
2023–24	రూ.5.13కోట్లు
2024–25	రూ.3.28కోట్లు

ఆదాయం పెంపునకు కృషి



మార్కెట్ ఆదాయాన్ని పెంచి సెలక్షన్ గ్రేడ్ కోసం కృషి చేస్తున్నాం. ఆదాయవనరుల పెంపకం కోసం ప్రత్యేక దృష్టి పెట్టాం. దుకాణాల నిర్మాణం ద్వారా ఆదాయం పెరగనుంది. ఈసారి వర్షాలు బాగా ఉండటంతో అధికంగా ధాన్యం పండి మార్కెట్ ఆదాయం పెరగనుంది. పత్తి జిన్నింగ్ మిల్లు ఏర్పాటవుతున్నందున ఆదాయం పెరగనుంది.

– చంద్రశేఖర్, మార్కెట్ ప్రత్యేక కార్యదర్శి, జహీరాబాద్

క్లుప్తంగా

ఉచిత కోచింగ్

సిద్దిపేటఅర్బన్: సిద్దిపేట ఐటీ హబ్‌లోని టాస్క్ కార్యాలయంలో టెక్నికల్ కోర్సులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు మేనేజర్ నరేందర్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. కోర్సులు జావా, పైథాన్, వెబ్ డెవలప్‌మెంట్, డేటాబేస్, సుడో కోడ్, సీ, సీప్లస్ ప్లస్, హెచ్‌టీఎంఎల్, సీఎస్ఎస్, జావా స్క్రిప్ట్, ఆప్టిట్యూడ్ రీజనింగ్, సాఫ్ట్ స్కిల్స్‌పై శిక్షణ ఇవ్వనున్నారు. ఏదైనా డిగ్రీ పూర్తి చేసి, ఆసక్తి కలిగిన అభ్యర్థులు టాస్క్ కార్యాలయంలో ఈ నెల 25, 26 తేదీల్లో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

ఏఐ అత్యంత ఆచరణీయం

మెదక్‌జోన్: ప్రభుత్వ పాలనా వ్యవస్థలో ఏఐ ప్రాధాన్యత అత్యంత ఆచరణీయమని కాకతీయ విశ్వవిద్యాలయం మాజీ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు రోజులుగా ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగం, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ , సదరన్ రీజియన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సదస్సు శనివారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. అన్ని రంగాల్లో అనుసరిస్తున్న కృత్రిమ మేధస్సు ఆవశ్యకతను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్, ఆర్డీఓ రమాదేవి, సమన్వయకర్త సురేందర్‌రావు, అధ్యాపకులు డాక్టర్ శరత్‌రెడ్డి, తిరుమలరెడ్డి పాల్గొన్నారు.

ఏపీకే లింకు ఓపెన్ చేస్తే నగదు మాయం

కౌడిపల్లి(నర్సాపూర్): ఫోన్‌కు వచ్చిన లింకును ఓపెన్ చేయడంతో ఓ ఉద్యోగి ఖాతా నుంచి నగదు మాయమైంది. ఈ ఘటన మండల కేంద్రంలో శనివారం జరిగింది. బాధితుడు వివరాల ప్రకారం.. కౌడిపల్లిలో రెండవ లైన్‌మెన్‌గా శివరాజ్ విధులు నిర్వహిస్తున్నాడు. మధ్యాహ్నం అతని వాట్సాప్‌కు ఎస్‌బీఐ సెల్ఫ్ రివార్డ్ ఏపీకే యాప్ లింక్ వచ్చింది. దీంతో అతను ఎస్‌బీఐ యోనో లింక్‌గా భావించి ఓపెన్ చేశాడు. దీంతో అవతలి నుంచి పేరు, బ్యాంక్‌ఖాతా వివరాలు నమోదు చేయాలని చెప్పడంతో అప్‌లోడ్ చేశాడు. అలాగే ఏటీఎం, ఓటీపీ వివరాలు అడిగే సరికి అతనికి అనుమానం వచ్చింది. కాగా అప్పటికే ఖాతా నుంచి రూ.49,870 డ్రా అయినట్లు మెసేజ్ వచ్చింది. వెంటనే ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి బ్యాంకుకు వెళ్లి అకౌంట్‌ను హోల్డ్‌లో పెట్టించాడు. సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పేకాట స్థావరంపై దాడి

దుబ్బాకరూరల్: పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన భూంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం... మండలంలోని గ్రామ శివారులో కొంత మంది పేకాట ఆడుతున్నారని వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. వారి వద్ద నుంచి రూ.29,375 , 5 మొబైల్ ఫోన్లు, నాలుగు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురిని అదుపులోకి తీసుకోగా మరో ఇద్దరు వ్యక్తులు పరారీలో ఉన్నారు. పేకాట ఆడుతున్న వారు తాళ్లపల్లి, రుద్రారం గ్రామాలకు చెందిన వారిగా గుర్తించారు.

గంజాయి స్వాధీనం

మునిపల్లి(అందోల్): అరకిలో ఎండు గంజాయిని తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. బుదేరా ఎస్ఐ రాజేశ్ నాయక్ వివరాల ప్రకారం... శనివారం ఉదయం కంకోల్ టోల్ ప్లాజా సమీపంలో కల్వకుర్తికి చెందిన మాడుగుల మారుతి, మరో బాలుడు కలిసి బీదర్ నుంచి గంజాయిని తీసుకొస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు.

కార్మికుడికి గాయాలు

జిన్నారం (పటాన్‌చెరు): పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్న కార్మికుడికి గాయాలయ్యాయి. ఈ ఘటన గడ్డపోతారం పారిశ్రామికవాడలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం ... ఎన్ మాక్స్ పరిశ్రమలో పనిచేసే సుధాకర్ విధులు నిర్వహిస్తుండగా క్రేన్ వెనుక నుంచి ఢీకొట్టడంతో కాలు విరిగి ప్రాణాలతో బయట పడ్డాడు. గాయాలైన కార్మికుడిని నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

అధికారులను తప్పుదోవ పట్టించిన వారిపై కేసు

కొండపాక(గజ్వేల్): ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌ను పొందడానికి అధికారులను తప్పుదోవ పట్టించిన ఐదుగురిపై కేసు నమోదైంది. కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ కథనం ప్రకారం... తొగుట మండలంలోని గుడికందుల గ్రామానికి చెందిన ముంద్రాతి యాదయ్య ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌ను కొండపాక మండల తహసీల్దార్ కార్యాలయం నుంచి పొందడానికి అధికారులను తప్పుదోవ పట్టించారు. వారిలో మంద్రాతి సరిత , రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, దుద్దెడ పంచాయతీ కార్యదర్శి చక్రపాణి, సిద్దిపేటలోని పారిపల్లి వీధిలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న టి.శంకరయ్య, మద్దూర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న గొరారం అనిత ఉన్నారు. మంద్రాతి అనిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

మద్యం లారీ బోల్తా

హుస్నాబాద్‌రూరల్: బీరు కాటన్‌లతో వెళుతున్న లారీ బోల్తాపడింది. మండలంలోని బంజేరుపల్లి క్రాసింగ్ వద్ద శనివారం సంగారెడ్డి నుంచి వరంగల్‌కు వెళుతున్న లారీ అదుపుతప్పి బోల్తా పడింది. సమాచారం తెలుసుకున్న ఎక్సైజ్ ఎస్సై రూప పంచనామా చేశారు. బోల్తా పడిన లారీలోని బీరు కాటన్స్‌ను మరో లారీలో లోడింగ్ చేసి పంపించారు.

వసుధైక కుటుంబం

ఉమ్మడి కుటుంబాలకు ఆదర్శం.. గేటెడ్ కమ్యూనిటీలు

ప్రాంతాలు, మతాలు, కులాలు వేరైనా అందరం ఒకే కుటుంబ సభ్యులమంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు గేటెడ్ కమ్యూనిటీ కాలనీవాసులు. కాలనీల సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలు చేస్తున్నారు. ఏ ఒక్కరికి కష్టం వచ్చినా వారికి అండగా నిలుస్తూ నాటి ఉమ్మడి కుటుంబాలను గుర్తుకు తెస్తున్నారు. అలాంటి కమ్యూనిటీలపై ఈ వారం సాక్షి ప్రత్యేక కథనం.

– రామచంద్రాపురం(పటాన్ చెరు):

- సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కృషి
- పండుగేదైనా కలిసి చేసుకుంటారు
- సామాజిక సేవలో సైతం ముందంజ

సమస్యలపై పోరాటం



రోడ్ల సమస్యలపై ఐక్య పోరాటంలో కాలనీవాసులు

కాలనీల్లో నెలకొన్న సమస్యలపై గేటెడ్ కమ్యూనిటీ వాసులు ఉమ్మడి పోరాటాలు చేస్తూ అందరికి స్ఫూర్తినిస్తున్నారు. ఏ కాలనీలో సమస్య వచ్చినా చిన్నారుల నుంచి వృద్ధుల వరకు రోడ్లపైకి వచ్చి పరిష్కారం కోసం ఉద్యమిస్తున్నారు. దీంతో ప్రతి ఒక్కరిలో అందరం ఒక్కటే అన్న భావన మరింత పెంపొందుతోంది. అలాగే పలువురికి సాయం చేస్తూ తమ మానవత్వాన్ని చాటుకుంటున్నారు.

మినీ ఇండియా..

హైదరాబాద్ మహానగర శివారు ప్రాంతమైన తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో సుమారు 70కిపైగా గేటెడ్ కమ్యూనిటీ కాలనీలున్నాయి. అందులో సుమారు 2లక్షల మంది ఉన్నారు. ఇక్కడ ఎక్కువ శాతం ఉత్తర భారతదేశానికి చెందిన వారే నివాసం ఉంటున్నారు. దేశంలోని అనేక రాష్ట్రాలకు చెందిన ఐటీ నిపుణులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, వ్యాపారవేత్తలు, ప్రముఖులు, ఎన్ఆర్ఐలు.. విల్లాస్, బహుళ అంతస్తుల భవనాలను కొనుగోలు చేసి నివసిస్తున్నారు. అన్ని రాష్ట్రాలకు చెందిన వారు ఉండటంతో ఈ ప్రాంతాన్ని మినీ ఇండియాగా పిలుస్తారు. కాలనీల్లో ఎవరికి కష్టమొచ్చినా వెంటనే అందరూ ముందుకొచ్చి అండగా నిలుస్తున్నారు. ప్రాంతాలను పక్కన పెట్టి ఇక్కడ అందరూ ఒకే కుటుంబ సభ్యులలాగా ఉంటూ జాతీయ ఐక్యతను చాటుతున్నారు.



జగన్నాథ రథయాత్రలో..

కలిసికట్టుగా పండుగలు

ఇతర రాష్ట్రాల నుంచి వచ్చినా ఆయా ప్రాంతాల వారి సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా కుల, మతాలను పక్కన పెట్టి పండుగలు జరుపుకుంటున్నారు. ప్రతి ఏటా కార్తీక మాసంలో వన భోజనాలను ఘనంగా నిర్వహిస్తారు. ఒడిశా ప్రజలు ఘనంగా జరుపుకునే జగన్నాథ రథయాత్రను అందరూ కలిసి ఎంతో వైభవంగా నిర్వహిస్తారు. దసరా, దీపావళి, రంజాన్, క్రిస్మస్ వేడుకలను సైతం జరుపుకుంటారు.



చెరువు పరిసరాలను శుభ్రం చేస్తున్న చిన్నారులు

సామాజిక సేవలో సైతం

కాలనీవాసులు సామాజిక సేవలో సైతం ముందున్నారు. స్థానిక చెరువు పరిసరాలను శుభ్రం చేయడంలో చిన్నారులు సైతం చురుకుగా పాల్గొంటున్నారు. ప్రతి వేసవిలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచిత శిబిరాలు నిర్వహిస్తారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత కారణంగా విద్యార్థులకు తరగతులు కూడా నిర్వహించారు. కోవిడ్ సమయంలో సుమారు 3వేల పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందించారు. అందరూ కలిసి పేద విద్యార్థులకు షూలు, పుస్తకాలు ఇచ్చారు. ఐటీ ఉద్యోగులు ఎవరికైనా ఉద్యోగం కావాలంటే తమ వంతు సహాయ, సహకారాలు అందిస్తున్నారు. ఉన్నత విద్య పూర్తి చేసిన వారికి ఉద్యోగాలు సంపాదించేలా సూచనలు ఇస్తారు.



కోవిడ్ సమయంలో వలస కార్మికులకు నిత్యావసర సరుకులు అందజేస్తూ..

సొంత గ్రామంలో ఉన్నట్లే..



తాము ఈ ప్రాంతంలో విల్లా కొనుగోలు చేసి నివాసం ఉంటున్నాం. ఇక్కడ ఉన్నప్పటికీ మా సొంత ప్రాంతంలో ఉన్నట్లే ఉంది. అనేక ప్రాంతాలకు చెందిన వారు ఇక్కడ ఉంటున్నారు. కలిసిమెలిసి సంతోషంగా ఉంటాం.

– పి.ఎస్.తివారీ, వ్యాపారవేత్త

అత్యవసర సమయంలో..



ఆపద వచ్చినప్పుడు అండగా నిలుస్తాం. ఈ ప్రాంతంలో ఉన్న వైద్యులు అత్యవసర సమయంలో వైద్యం అందించటానికి సిద్ధంగా ఉన్నాం.

– డా.భవాని ఈశ్వర్ గారి, తెల్లాపూర్

సమైక్య భావాన్ని..



దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలు ఇక్కడ ఉన్నారు. అన్ని పండుగలను కలిసి జరుపుకుంటాం. జాతీయ ఐక్యతను చాటుతూ సమైక్య భావాన్ని పెంపొందిస్తున్నాం.

– చిలకమర్రి ప్రభాకర్ రెడ్డి, తెల్లాపూర్

అంగన్‌వాడీ తాగునీటిలో చుంచెలుక

- రత్నపూర్ కేంద్రంలో ఘటన
- పలువురు చిన్నారులకు స్వల్ప అస్వస్థత
- సిబ్బందికి మెమో జారీ



బిందెలో నుంచి బయటపడిన చుంచెలుక కళేబరం

శివ్వంపేట(నర్సాపూర్): అంగన్‌వాడీ సిబ్బంది నిర్లక్ష్యం వల్ల తాగునీటి బిందెలో చనిపోయిన చుంచెలుక దర్శనమిచ్చింది. ఈ ఘటన మండల పరిధిలోని రత్నపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం జరిగింది. అంగన్‌వాడీ కేంద్రానికి ఎనిమిది మంది చిన్నారులు వచ్చారు. అనంతరం చిన్నారులు కేంద్రంలో నిల్వ ఉంచిన ప్లాస్టిక్ బిందెలోని నీరు తాగారు. మధ్యాహ్న భోజన సమయంలో కేంద్రానికి వచ్చిన ఓ చిన్నారి తల్లి ప్లాస్టిక్ బిందెలో ఉన్న నీరు తాగేందుకు చూడగా అందులో చనిపోయిన చుంచెలుక కనిపించడంతో అవాక్కయింది. పలువురు చిన్నారులు స్వల్ప అస్వస్థతకు గురికావడంతో తల్లిదండ్రులు నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్యం నిలకడగా ఉండటంతో ఇండ్లకు పంపించారు. కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న టీచర్ నవీన, ఆయా రాజమ్మ నిర్లక్ష్యం వల్లే ఇలా జరిగిందని చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఉన్న నిల్వ నీరు, వంటకు ఉపయోగించే నీటి పాత్రల్లో తోక పురుగులు ఉండటంతో సిబ్బందిపై సీడీపీఓ హేమభార్గవి, సూపర్‌వైజర్ సంతోష ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన టీచర్, ఆయాకు మెమో జారీ చేశారు.

కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి ..

కుంటలో జారిపడి యువకుడు మృతి



సింధూర్

హవేళిఘణాపూర్(మెదక్): యువకుడు కాలు జారి కుంటలోపడి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని స్కూల్ తండా పంచాయతీ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. తండాకు చెందిన సింధూర్(19) శనివారం మధ్యాహ్నం కాలకృత్యాలు తీర్చుకునేందుకు కుంటలోకి వెళ్లాడు. దీంతో కాలు జారి అందులో పడటంతో ఈత రాక మునిగి మృతి చెందాడు. గమనించిన ఇరుగుపొరుగు కాపాడేందుకు యత్నించేలోపే మృతి చెందాడు. సింధూర్ తల్లిదండ్రులు గతంలోనే మృతి చెందగా తన తమ్ముడితో కలిసి ఉంటున్నాడు. ఎస్ఐ నరేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చేపలు పట్టేందుకు వెళ్లి...



వడ్ల రమేశ్

కౌడిపల్లి(నర్సాపూర్): చేపలు పట్టేందుకు వెళ్లి వ్యక్తి మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన మండలంలోని మహమ్మద్‌నగర్‌లో జరిగింది. ఎస్ఐ రంజిత్‌రెడ్డి వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన వడ్ల రమేశ్(44) శుక్రవారం సాయంత్రం గ్రామ సమీపంలోని అవుసలివాని కుంటలో చేపలు పట్టేందుకు వెళుతున్నానని ఇంట్లో చెప్పాడు. రాత్రి వరకు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు కుంటవద్దకు వెళ్లి చూడగా ఒడ్డున అతని బట్టలు కనిపించాయి. గ్రామస్తులకు విషయం చెప్పి కుంటలో వెతికించారు. అతని మృతదేహం లభించింది. చేపలు పట్టే క్రమంలో కాళ్లకు వల చుట్టుకోవడంతో నీటిలో మునిగి చనిపోయినట్లు తెలిపారు. మృతునికి భార్య లావణ్య, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు.

దొమ్మాటలో చిరుతపులి కలకలం

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



చిరుత సంచారంపై వివరాలు అడిగి తెలుసుకుంటున్న బీట్ ఆఫీసర్ మధులత



చిరుత పాదముద్ర

దౌల్తాబాద్(దుబ్బాక): మండలంలో చిరుతపులి సంచారం కలకలం రేపింది. వివరాలు.. దొమ్మాట అటవీ శివారులో చిరుత పులి సంచరిస్తుందంటూ గ్రామస్తులు భయాందోళన వ్యక్తం చేశారు. శనివారం గ్రామ శివారులోని పంట పొలాల్లో చిరుత కనిపించినట్లు గ్రామానికి చెందిన కొందరు యువకులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. దుబ్బాక సెక్షన్ అధికారి మల్లేశంతోపాటు బీట్ ఆఫీసర్ మధులత దొమ్మాట అటవీ ప్రాంతానికి చేరుకున్నారు. పరిసర ప్రాంతాలను పరిశీలించి పులి పాద ముద్రలు గుర్తించారు. చేగుంట మండలంలోని కొండాపూర్, ఉప్పర్‌పల్లి, అక్బర్‌పేట–భూంపల్లి మండలం అల్మాజీపూర్ లింగం చెరువు మీదుగా మండలంలోని దొమ్మాట అటవీ ప్రాంతానికి చిరుతపులి వెళ్లినట్లు పాదముద్రల ఆధారంగా నిర్ధారించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. వ్యవసాయ పొలాల వద్ద పాడి పశువులు, గొర్రెలు, మేకలను ఉంచొద్దని, ఇండ్ల వద్ద కట్టేసుకోవాలని సూచించారు. అటవీ ప్రాంతంలో సీసీ కెమెరాలు అమర్చామని, త్వరలో పట్టుకుంటామని అటవీ శాఖ అధికారులు తెలిపారు.

వేర్వేరు చోట్ల నలుగురు అదృశ్యం



గౌతమ్ కుమార్

పటాన్‌చెరు టౌన్: యువకుడు అదృశ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్ఐ అశోక్ వివరాల ప్రకారం... మండలంలోని రామేశ్వరం బండ గ్రామానికి చెందిన గోపాల్ రామ్ కుమారుడు గౌతమ్ కుమార్ కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 21న రాత్రి ఇంటికి రాకపోవడంతో అతడికి కుటుంబ సభ్యులు ఫోన్ చేశారు. తాను ఇంటికి రానని, తన స్నేహితుడు సాయికిరణ్‌తో గొడవ జరిగిందని, హఫీజ్‌పేట్‌కి వెళ్తున్నానని చెప్పి ఫోన్ కట్ చేశాడు. తిరిగి ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు గౌతమ్ కోసం తెలిసిన వారు, స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు. తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పుల్‌కల్‌లో వృద్ధుడు..

పుల్‌కల్(అందోల్): ఇంటి నుంచి బయటకు వెళ్లిన వృద్ధుడు అదృశ్యమయ్యాడు. ఎస్ఐ విశ్వజన్ కథనం ప్రకారం... మండల పరిధిలోని పెద్దారెడ్డిపేటకు చెందిన గంతి కాశీనాథం(65)ఈ నెల 20న మునిపల్లిలోని బంధువుల ఇంటికి వెళుతున్నానని బయలుదేరాడు. కానీ, బంధువుల ఇంటికి వెళ్లలేదు. మూడు రోజుల నుంచి వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాలిక..



ఆసియా

పటాన్‌చెరు టౌన్: బయటకు వెళ్లిన బాలిక అదృశ్యమైన ఘటన బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన జిగేన్ బతుకుదెరువు కోసం వచ్చి తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఘనపూర్ సమీపంలోని ఓ కంపెనీలో కూలి పని పనిచేసుకుంటూ అక్కడే ఉంటున్నారు. ఈ నెల 21న జిగేన్ కూతురు ఆసియా ఎవరికి చెప్పకుండా బయటికి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు స్థానికంగా, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు.

నర్సాపూర్‌లో వ్యక్తి..

నర్సాపూర్ రూరల్: వ్యక్తి అదృశ్యమైన ఘటన నర్సాపూర్‌లో శనివారం వెలుగు చూసింది. ఎస్సై లింగం వివరాల ప్రకారం... పట్టణానికి చెందిన మహమ్మద్ అఖిల్ అలియాస్ మహమ్మద్ ఫక్రు పోలీస్ స్టేషన్ ఎదురుగా మిర్చి బండి నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నెల19వ తేదీ రాత్రి వరకు మిర్చి బండి నడిపి ఆ తర్వాత ఇంటికి వెళ్లకుండా కనిపించకుండా పోయాడు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రైలు ఎక్కుతూ కిందపడి..



కిష్టయ్య

మనోహరాబాద్(తూప్రాన్): రైలు ఎక్కబోయి కిందపడి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మనోహరాబాద్ రైల్వేస్టేషన్ వద్ద శనివారం చోటు చేసుకుంది. కామారెడ్డి రైల్వే ఎస్ఐ లిబాంద్రి వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన తాడేపు కిష్టయ్య (71) రైల్వేలో లోకో పైలట్‌గా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేశాడు. కాగా కుటుంబ సభ్యులతో బొల్లారం రైల్వే స్టేషన్ దగ్గరలో నివాసం ఉంటున్నాడు. అతడికి వ్యవసాయ పొలం ఉండటంతో గ్రామానికి వచ్చి పనులు ముగించుకుని తిరిగి ఇంటికి వెళుతున్నాడు. ఈ క్రమంలో మనోహరాబాద్ రైల్వే స్టేషన్ వద్ద బోధన్– కాచిగూడ పాసింజర్ రైలు కదులుతుండగా బోగిలోకి ఎక్కబోయి అదుపుతప్పి రైలు కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో అతడు రెండు కాళ్లు కోల్పోయాడు. గమనించిన స్థానికులు మేడ్చల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ చనిపోయాడు. మృతునికి భార్య, కుమారుడు, నలుగురు కుమార్తెలున్నారు.

టిప్పర్ ఢీకొని వ్యక్తి దుర్మరణం

కొండాపూర్(సంగారెడ్డి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన శనివారం గుంతపల్లిలో చోటు చేసుకుంది. కొండాపూర్ ఎస్సై సోమేశ్వరి కథనం ప్రకారం... గ్రామానికి చెందిన రాములు(50) ఉదయం 8 గంటల ప్రాంతంలో తన ద్విచక్ర వాహనంపై గ్రామ శివారులో ఉన్న పొలానికి వెళ్లాడు. తిరిగి వస్తున్న క్రమంలో ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొట్టింది. డ్రైవర్ తన టిప్పర్‌ను అతి వేగంగా నడపడం వల్లే ప్రమాదం జరిగిందని కుటుంబసభ్యులు ఆరోపించారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ.. ఒకరు మృతి

హుస్నాబాద్: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందాడు. ఈ ఘటన శనివారం హుస్నాబాద్‌లో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... పట్టణంలోని బస్ డిపో రోడ్డులో మడద గ్రామానికి చెందిన బూడిద అజయ్ (30), తన తల్లితో కలిసి పాల కేంద్రం నుంచి పాలు తీసుకొని బైక్‌పై వెళుతున్నారు. అదే సమయంలో అటుగా ఆరపల్లెకు చెందిన నమిలికొండ రామకృష్ణ బైక్‌పై వస్తున్నాడు. ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొనడంతో ఇరువురు కిందపడిపోయారు. అజయ్‌తో పాటు తన తల్లికి తీవ్ర గాయాలు కాగా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అజయ్ చనిపోగా, ఆయన తల్లి తలకు తీవ్ర గాయాలవడంతో కరీంనగర్‌కు తరలించారు. మరో బైక్‌పై ఉన్న రామకృష్ణకు సైతం గాయాలయ్యాయి. మృతుడుకి భార్య, కూతురు ఉన్నారు. మృతి చెందిన అజయ్‌కి న్యాయం చేయాలని ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలోని రోడ్డుపై బంధువులు, గ్రామస్తులు, బీఎస్పీ నాయకులు ధర్నా నిర్వహించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని బాధితులకు న్యాయం చేస్తామని చెప్పడంతో ధర్నా విరమించారు.

డెంగీతో ఇంటర్ విద్యార్థి మృతి



శ్రావణ్

జగదేవ్‌పూర్(గజ్వేల్): డెంగీ జ్వరంతో ఇంటర్ విద్యార్థి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని తిమ్మాపూర్‌లో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన నాయిని మహేందర్–పోచమ్మ దంపతుల కుమారుడు శ్రావణ్(17) గజ్వేల్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ బైపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. మూడు రోజుల క్రితం శ్రావణ్‌కు జ్వరం రావడంతో గ్రామంలోని ఓ ప్రైవేటు క్లినిక్‌లో చికిత్స చేయించుకున్నాడు. జ్వరం ఎక్కువ అవడంతో శుక్రవారం రాత్రి గజ్వేల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి, పరిస్థితి విషమంగా ఉండటంతో కొంపల్లిలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ రక్త పరీక్షలు నిర్వహించిన వైద్యులు డెంగీ జ్వరంగా గుర్తించారు. చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందాడు.

కూతురి మృతి తట్టుకోలేక తండ్రి..

హవేళిఘణాపూర్(మెదక్): కన్న కూతురు మృతి తట్టుకోలేక ఓ తండ్రి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని సర్దన గ్రామంలో వెలుగు చూసింది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పిల్లి కృష్ణ(40) పెద్ద కుమార్తె వెంకటలక్ష్మి గత ఏడాది క్రితం అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందింది. ఈ విషయంలో తండ్రి అనేకమార్లు బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురై శుక్రవారం రాత్రి ఇంట్లో నుంచి వెళ్లిపోయి గ్రామ శివారులోని కుంటకట్ట వద్ద గల చెట్టుకు ఉరివేసుకున్నాడు.

నర్సాపూర్‌లో మహిళ...

నర్సాపూర్ రూరల్: అనారోగ్య సమస్యలతో ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన శనివారం నర్సాపూర్‌లో జరిగింది. ఎస్సై లింగం వివరాల ప్రకారం... పట్టణానికి చెందిన చిత్తారి శాంత (34) కొంతకాలంగా తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. ఈ క్రమంలో మనస్తాపంతో ఇంట్లో ఎవరు లేని సమయంలో చేసుకుంది. మృతురాలికి కుమారుడు, భర్త శ్రీనివాస్ ఉన్నారు.

అనారోగ్యంతో వృద్ధురాలు...

బెజ్జంకి(సిద్దిపేట) : అనారోగ్య సమస్యలతో ఓ వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మండల పరిధిలో జరిగింది. పోలీసుల వివరాలు ఇలా... తోటపల్లి గ్రామానికి చెందిన రేవోజు లక్ష్మి(55) స్వగ్రామంలోనే వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తుంది. అనారోగ్యంతో నాలుగేళ్ల క్రితం భర్త శంకరయ్య మృతి చెందాడు. వారి ముగ్గురు కూతుర్లకు వివాహాలు జరిగాయి. లక్ష్మి ఒంటరిగానే ఉంటోంది. నెల రోజులుగా అనారోగ్య సమస్యలతో ఆమె బాధ పడుతుంది. ఆస్పత్రిలో పరీక్షలు నిర్వహించగా లివర్ చెడిపోయిట్లు గుర్తించారు. చికిత్స నిమి త్తం కరీంనగర్ వెళ్లేందుకు బెజ్జంకి బ్యాంకు ఖాతా లో ఉన్న డబ్బులు తీసుకువస్తానని బిడ్డలకు చెప్పి శుక్రవారం వెళ్లింది. తిరిగి సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో గ్రామంలో ఆరా తీయగా మా మిడితోట వైపునకు వెళ్లినట్లు చెప్పారు. వెంటనే కూతుర్లు అక్కడకువెళ్లి చూడగా క్రిమిసంహారక మందు తాగి బావిలో దూకినట్లు గుర్తించారు. అనారోగ్యంతో మనస్తాపం చెంది లక్ష్మి ఆత్మహత్యకు పాల్పడినట్లు కుమార్తె పోలీసులకు ఫిర్యాదు చేసింది.

నిజాంపేటలో మహిళ..



వొగుల రాజవ్వ

నిజాంపేట(మెదక్): మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన శనివారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... మండల కేంద్రానికి చెందిన వొగుల రాజవ్వ(55) తన ఇంట్లో ఎవ్వరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. బయటి నుంచి కొడుకు ఇంటికి తిరిగి వచ్చి చూసే సరికి ఆత్మహత్య చేసుకొని కనిపించింది. మృతి గల కారణాలు తెలియాల్సి ఉంది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలిస్తున్నారు.

వ్యవసాయంలో నష్టం రావడంతో..



సత్తయ్య

దౌల్తాబాద్(దుబ్బాక): రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని ఉప్పర్‌పల్లిలో శనివారం జరిగింది. ఎస్ఐ అరుణ్‌కుమార్ కథనం ప్రకారం... గ్రామానికి చెందిన పుట్ట సత్తయ్య (60) వ్యవసాయంలో నష్టం రావడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ నేపథ్యంలో సత్తయ్య తన సమీప బంధువైన లింగరాజుపల్లికి చెందిన అల్లుడు మర్కంటి స్వామికి ఫోన్ చేసి చనిపోతున్నానని చెప్పాడు. అప్రమత్తమైన స్వామి మృతుడి పెద్ద కుమారుడు నరేశ్‌కు సమాచారం అందించాడు. దీంతో అతడు వ్యవసాయ పొలం వద్దకు వెళ్లగా అక్కడ అప్పటికే ఓ చింత చెట్టుకు సత్తయ్య ఉరివేసుకుని మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.